జిల్లాలో పనిచేయడం సంతృప్తి కలిగించింది

- ఎండోమెంట్ కమిషనర్, టూరిజం డైరెక్టర్ హనుమంతు కె.జెండగే

ఎండోమెంట్ కమిషనర్, టూరిజం డైరెక్టర్ హనుమంతు కె.జెండగేను సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, ఉద్యోగ సంఘాల నాయకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 19 : కలెక్టర్‌గా జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తిని కలిగించిందని ఎండోమెంట్ కమిషనర్, టూరిజం డైరెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఆయనకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, ఉద్యోగ సంఘాల నాయకులు జెండగేను శాలువాలతో సత్కరించి పూల బొకేలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జాక్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఆర్‌డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్‌ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి సురేశ్

సామాజిక తనిఖీ వేదికలో పాల్గొన్న ఏపీడీఓ సురేశ్

రామన్నపేట, నవంబర్ 19 : ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి గుర్రం సురేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగిన 15వ విడుత సామాజిక తనిఖీ వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని సోషల్ ఆడిట్‌లో హాజరు మస్టర్ పట్టికలో కొట్టివేతలు, తక్కువ పనికి ఎక్కువ బిల్లులు చేయడం, కొలతల్లో తేడాలు రావడం, ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలకు, క్షేత్రస్థాయిలో బతికున్న మొక్కల తేడాలను రికార్డు చేశారు. పాస్ ఆర్డర్ లేకుండానే డబ్బులు చెల్లించిన విధానాన్ని ఆయన ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో ఉండి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, జిల్లా విజిలెన్స్ అధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి, సహాయ విజిలెన్స్ అధికారి ఆదిత్యవర్ధన్, అంబుడ్స్‌మన్ వీరమల్లు, ఎస్ఆర్‌పీ స్వామి, ఎంపీఓ రవూఫ్‌అలీ, ఏపీఓ వెంకన్న పాల్గొన్నారు.

వరి కొయ్యలతో సూక్ష్మజీవుల వృద్ధి : డీఏఓ గోపాల్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ గోపాల్, అధికారులు

మోత్కూరు, నవంబర్ 19 : వరి కొయ్యల వల్ల సూక్ష్మజీవుల వృద్ధి పెరుగుతుందని డీఏఓ గోపాల్ అన్నారు. మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో ఆయన మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చవద్దన్నారు. ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్ఫేట్ చల్లడం వల్ల వరి కొయ్యలు నీటిలో కుళ్లిపోయి పంటలకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కీర్తి, ఏఈఓలు తుంగ గోపీనాథ్, ముప్పిడి అశోక్, అంబటి వేణు, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

భువనగిరి కలెక్టరేట్ : యాసంగి సీజన్‌కు జిల్లాలో సరిపడా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన దుకాణ డీలర్లు విత్తన వివరాలను స్టాక్ బోర్డులపై ప్రదర్శించాలని, విత్తనాలను మద్దతు ధర కంటే ఎక్కువగా అమ్మితే కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. విక్రయించిన విత్తనాలకు సరైన బిల్లులు అందించాలని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తన దుకాణ డీలర్లు అవకతవకలకు పాల్పడితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

గుండాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుజాత

గుండాల, నవంబర్ 19 : మండల కేంద్రంతోపాటు సుద్దాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ సుజాత మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రక్‌షీట్లను పరిశీలించి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు గుండాల, సీతారాంపురం గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విత్తనాల నిల్వలను పరిశీలించి ఫర్టిలైజర్ దుకాణ నిర్వాకులకు పలు సూచనలు చేశారు.

కార్తిక వన భోజనాలు

కార్తిక వన భోజనాలకు వెళ్లిన పద్మ బ్రాహ్మణ పురోహితులు

భూదాన్ పోచపల్లి, నవంబర్ 19 : పట్టణంలో పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం అందరూ కలిసి వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో పద్మ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, ప్రతినిధులు దోర్నాల కృష్ణపంతులు, మార్కండేయ స్వామి దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, సంఘం పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి భాస్కర్, ఉపాధ్యక్షుడు బొమ్మ పాండు, ప్రధాన కార్యదర్శి మక్కం నరేందర్, సహాయ కార్య నిర్వహణ కార్యదర్శి కటకం నరహరి, కోశాధికారి మహేశ్వరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘం రాష్ట్ర నాయకుడు అంజయ్య

చౌటుప్పల్, నవంబర్ 19 : ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23న నల్లగొండలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘం రాష్ట్ర నాయకుడు నాగారం అంజయ్య పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మాల సోదరులు అడ్డు పడుతున్నారన్నారు. మాదిగలను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి చర్యలను తక్షణమే మానుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు దుబ్బ రామకృష్ణ, బోయ లింగస్వామి, బోయ రాంచందర్, బోయ దేవేందర్, కృష్ణయ్య, వెంకటేశ్ మహాజన్, వెంకటయ్య, శ్రీనాథ్, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా వెండి మొక్కు జోడు సేవ

ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, నవంబర్ 19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి ప్రాకార మండపంలో ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. సువర్ణమూర్తులకు బంగారు పుష్పాలతో అర్చన జరిపారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, కల్యాణోత్సవ సేవ, నిత్యతిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు దర్బార్‌సేవ, తిరువారాధన, సహస్రనామార్చన చేపట్టి శయనోత్సవ సేవను చేపట్టారు. అనంతరం ద్వారాబంధనం గావించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి నాగావళి దళార్చన జరిగింది. వెయ్యి తమలపాకులతో సహస్రనామార్చన జరిపి, వడపప్పు, బెల్లం నైవేద్యంగా సమర్పించారు. కార్తిక మాసం సందర్భంగా దీపారాధన, సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.35,29,669 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

రామన్నపేట, నవంబర్ 19 : పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పెద్దగోని నర్సింహ (50) ట్రాక్టర్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో పొలం దున్నుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో స్టీరింగ్, కల్టివేటర్ మధ్య ఇరుక్కుపోయిన నర్సింహ అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

బస్టాప్‌లో వ్యక్తి మృతదేహం

భువనగిరి అర్బన్, నవంబర్ 19 : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన సమీపంలో గల బస్టాప్‌లో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి ఏరియా దవాఖానలోని మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఓటర్ ఐడీ కార్డులో మరిచెట్టి నాగేంద్ర గణేశ్, తండ్రి నూకరాజు, వయస్సు 38 సంవత్సరాలు, ఇంటి నంబర్ 17-3-1/7/1/ఏ, జవహార్ పుర, యాకుత్‌పుర, చార్మినార్, హైదరాబాద్‌గా ఉన్నట్లు తెలిపారు. అతను నవంబర్ 13న రైల్లో వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోగా.. రైల్వే పోలీసులు భువనగిరి ఏరియా దవాఖానలో చేర్పించినట్లు చెప్పారు. పరిశీలించిన డాక్టర్ మెరుగైన వైద్యం కోసం గాంధీ హాస్పిటల్‌కు రిఫర్ చేయగా.. అతను హాస్పిటల్ నుంచి బయటకు వచ్చి చుట్టుపక్కల తిరుగుతున్న క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ ఎస్ఐ అరుణ్‌కుమార్ (8712579973), పట్టణ పోలీస్ స్టేషన్ (8712662803)లో సంప్రదించాలని ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

భువనగిరిలో యువకుడి మృతదేహం గుర్తింపు

భువనగిరి అర్బన్, నవంబర్ 19 : పట్టణంలో యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తుక్కాపురం చౌరస్తా సమీపంలో మిర్చి వ్యాపారం నిర్వహించే షాపు వెనుకభాగంలో గల చెట్ల పొదల్లో యువకుడి మృతదేహాన్ని మిర్చి వ్యాపారి మంగళవారం గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల, కనుబొమ్మపై బలమైన గాయాలున్నట్లు గుర్తించారు. మృతుడు బీహార్ రాష్ట్రం సీతామేహరి జిల్లా బహిరి గ్రామానికి చెందిన మహ్మద్ శంశె అల్లం, తండ్రి మహ్మద్ మనిర్ అల్లంగా గుర్తించారు. మృతుడు తన స్వగ్రామానికి చెందిన జమీల్ అక్తర్‌తో కలిసి మెకానిక్ పని చేస్తుండేవాడని, సుమారు 22 సంవత్సరాలు ఉంటాయని, పని నిమిత్తం ఇక్కడకు వచ్చాడని పేర్కొన్నారు. ఎవరో పదునైన రాడ్డుతో తలపై కొట్టి, వేరేచోట చంపి ఇక్కడికి తీసుకొచ్చి వేశారని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ చెప్పారు.

ఇల్లు ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 19 : కులం పేరుతో దూషించి జేసీబీతో ఇంటిని ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పిల్లాయిపల్లి గ్రామానికి చెందిన కుతాటి యాదగిరి 26 సంవత్సరాల క్రితం రంగనాయకస్వామి గుడి పక్కన గుట్ట కింద గుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. ఆగస్టులో కురిసిన వర్షాలకు గుడిసె కూలిపోయింది. దాన్ని సరి చేసుకోవడానికి గోడ కట్టాడు. కొందరు వ్యక్తులు మంగళవారం ఉదయం వచ్చి కులం పేరుతో దూషిస్తూ గోడను జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ క్రమంలో అడ్డం పోయిన తన భార్య నడుముకు గాయమైందని బాధితుడు ఆరోపించాడు. కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన పది మందిపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

భద్రమ్మకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

మల్లయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, నవంబర్ 19 : మండలంలోని దుబ్బాక గ్రామ మాజీ ఎంపీటీసీ మేకల భద్రమ్మ భర్త మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భద్రమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. మల్లయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎంపీపీ నీల దయాకర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు కంభంపాటి శ్రీనివాస్, సాల్వేరు అశోక్, సతీశ్, రమేశ్, వెంకటేశం, చాంద్, మల్లేశం, రాంబాబు, రాంచంద్రారెడ్డి, వీరస్వామి, శంకర్, భిక్షం ఉన్నారు.

వైద్య కళాశాల ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 19 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్టకు మంజూరైన వైద్య కళాశాల ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో మల్లాపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 64లో వైద్య కళాశాల ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారన్నారు. దాని కోసం అధికారులు స్థలాన్ని కూడా పరిశీలించి నివేదిక సమర్పించారని తెలిపారు. గుట్టకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను మల్లాపురం గ్రామ పరిధిలోనే నిర్మించాలన్నారు. సైదాపురం, మల్లాపురం, దాతరుపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్లాపురం పరిధిలో వైద్య కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఒగ్గు మల్లేశం, కర్రె చంద్రశేఖర్, రమేశ్, గోపి, వంశీ, విజయ్, చంద్రశేఖర్‌గౌడ్, కరుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

చౌటుప్పల్, నవంబర్ 19 : చౌటుప్పల్ పట్టణంలో డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలను బస్వాపురం రిజర్వాయర్, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల విస్తరణ పనులు, మూసీ ప్రక్షాళన, పరిశ్రమల కాలుష్యం తదితర సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. మహాసభలో వీటిపై ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఇందుకోసం అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు కదిలి రావాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, కిష్ణయ్య, బాలయ్య, సంజీవరెడ్డి, సబిత, నందీశ్వర్, శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకపోతే సీఎం పర్యటనను అడ్డుకుంటాం

- మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, నవంబర్ 19 : గ్రామపంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించకపోతే సీఎం పర్యటనలను అడ్డుకుంటామని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా సర్పంచులను పోలీసులతో నిర్బంధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరన్నారు. అధికారంలోకి వచ్చిన నెలలోపు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో తాజా మాజీ సర్పంచులపై ఎమర్జెన్సీ కొనసాగుతుందని, ప్రభుత్వ తీరు ఇలానే కొనసాగితే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాజా మాజీ సర్పంచులు నాగిర్తి గోపిరెడ్డి, ఠాకూర్ ధర్మేందర్‌సింగ్, చెరుకు కనకయ్య, దేవీరాములునాయక్ పాల్గొన్నారు.

23న మాదిగ ఆత్మీయ సమ్మేళనం

సమావేశంలో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య

భువనగిరి అర్బన్, నవంబర్ 19 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 23న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి మాదిగలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. పార్టీలకతీతంగా కలిసి వచ్చి వర్గీకరణను సాధించుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నాగారం అంజయ్య, బర్రె జహంగీర్, ఇటుకల దేవేందర్, బర్రె సుదర్శన్, శివలింగం, రామకృష్ణ, కృష్ణ, చిన్న, శంకర్, సాయి, జహంగీర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

వచ్చే నెల 7వరకు ప్రజాపాలన కళాయాత్ర : కలెక్టర్

ప్రజాపాలన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 19 : ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు 2024లో భాగంగా ఈ నెల 19నుంచి డిసెంబర్ 7వరకు జిల్లాలో ప్రజాపాలన కళాయాత్ర కొనసాగుతుందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కళాయాత్ర ప్రచార వాహనాన్ని మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రెండు బృందాలుగా ఏర్పడి మున్సిపాలిటీలోని వార్డుల్లో, ప్రతి మండలం, గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి యు.అరుంధతి, అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్మోహన్‌ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ : సంగెం గ్రామంలో పార్‌బాయిల్డ్ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్/వలిగొండ, నవంబర్ 19 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. భువనగిరి మండలంలోని బొల్లెపల్లిలో, వలిగొండ మండలం సంగెం, గోకారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంగెం గ్రామంలోని ధాన్యలక్ష్మి పార్‌బాయిల్డ్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వలిగొండ తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ కరుణాకర్ రెడ్డి, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

రైతులు పంట మార్పిడి విధానం చేపట్టాలి : డీఏఓ

అడ్డగూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 19 : తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు రైతులందరూ పంట మార్పిడి విధానం పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని సర్వేపల్లిలో మంగళవారం వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు పంట నమోదు చేయించుకోవడంతోపాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఫర్టిలైజర్ షాపులను డీఏఓ గోపాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల రికార్డులను పరిశీలించిన ఆయన స్టాక్ ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ పాండు రంగాచారి ఉన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగ